అప్రమత్తత లేకుంటే అంతే!

నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- వాహనాలు, ఇతర విషయాల్లో జాగ్రత్తలు అవసరం
- అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం



ఫైర్ సేఫ్టీని పరిశీలిస్తున్న అధికారి(ఫైల్)



ప్రభుత్వాస్పత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ఎండకు కాలి బూడిదైన వాహనం... కారు టైరు పేలడంతో ప్రమాదం... షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఇల్లు.. తరచూ ఇలాంటి వార్తలను మనం చూస్తూనే ఉన్నాం. ఎండలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యాన ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రణాళికతో పనులు...

పనులు ఏవైనా సరే ఉదయం, సాయంత్రం వేళల్లో చేసుకోవడమే మేలు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ప్రయాణం చేయడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉద్యోగం, బాధ్యతలు, వృత్తిని కాలంతో సంబంధం లేకుండా కొందరు పనులు చేస్తూనే ఉండాలి. వాహనాలకు కూడా నిత్యం పని చెప్పాల్సిందే. ఈక్రమంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

వాహనం కండీషన్ ముఖ్యం..

కారు, బైకు వాహనం ఏదైనా సరే కండీషన్‌లో ఉంచడం ముఖ్యం. ఎండాకాలంలో సాధారణం కంటే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించడం, బ్యాటరీ ఇతర విషయాల్లో నిపుణులను సంప్రదిస్తూ ఉండాలి. దూరప్రయాణాల్లో మధ్యమధ్యలో విశ్రాంతి తప్పనిసరి. ఇక ఎలక్ట్రిక్ బైకులు, కార్లు వాడేవారు ఎండలతో జాగ్రత్తగా ఉండాని నిపుణులు సూచిస్తున్నారు. బ్యాటరీ వేడిగా ఉన్నప్పుడు చార్జింగ్ పెట్టకపోవడమే మేలు. ఇక ఎండల్లో వాహనాలను నిలపొద్దు. అలాగే, ఎండలతో రోడ్లు వేడెక్కి ఉంటున్నందున టైర్ల విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి.

అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన నంబర్లు

కేంద్రం	కార్యాలయ ఫోన్	అధికారి నంబర్
భద్రాచలం	08743-232301	8712699293
అశ్వారావుపేట	08740-255501	8712699299
మణుగూరు	08746-222101	8712699301
(ఫైర్ ఔట్ పోస్ట్)		

అవగాహన కల్పించాం..



అగ్ని ప్రమాదాల నివారణపై దృష్టి సారించాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు, వ్యాపార సంస్థల్లో అవగాహన కల్పించాం. వేసవిలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సిబ్బందిని అప్రమత్తం చేస్తూ, నీటి కొరత లేకుండా చూస్తున్నాం. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి.

– శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి, భద్రాచలం

టైర్లపై దృష్టి పెట్టండి..



ఎండాకాలంలో రోడ్లు ఎంతో వేడిగా ఉంటాయి. ఆ వేడి మొత్తాన్ని ముందుగా గ్రహించేది వాహనాల టైర్లు. అందుకే టైర్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండాకాలంలో సాధ్యమైనంత వరకు తక్కువ దూరమే ప్రయాణం చేయడం మంచిది. పాత టైర్లను వాడకపోవడమే ఉత్తమం.

– తిరుపతి, ఏంవీఐ, భద్రాచలం

పేదలకు అండగా ప్రభుత్వం..



చెక్కు పంపిణీ చేస్తున్న విప్ రేగా కాంతారావు

గుండాల: సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టి పేదలు ఇంట అండగా నిలిచారని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం ఆళ్లపల్లి మండలం కేంద్రంలో రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అదేవిధంగా పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను విప్ రేగా కాంతారావు అభినందించారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించి ఇదే ఒరవడిని చాటుకోవాలని ఆకాంక్షించారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో వరుసగా రెండు రోజుల పాటు పినపాక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అత్యంత మారుమూల గ్రామాల్లో పర్యటించి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఎర్ర బస్సు ఎరుగని చెట్టుపల్లికి బీటీ రోడ్‌తో పాటు ఎర్ర బస్సుతో వెళ్లారు. ఆళ్లపల్లి మండలంలో మర్కోడు మారుమూల పల్లెల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె. మంజు భార్గవీ, వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, జెడ్పీటీసీ కొమరం హనుమంతరావు, ఎంఈఓ పెండెకట్ల కృష్ణయ్య, నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



నాగుపల్లిలో దళితబంధు యూనిట్ డెయిరీ ఫామ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సుడిగాలి పర్యటన చేశారు పెద్దగొల్లగూడెం గ్రామంలో కొర్రాజుల జాతరలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నాగుపల్లి గ్రామంలో దళితబంధు లబ్ధిదారుడు ఫెరికే శ్యాంసన్ గేదెల డెయిరీ ఫాం యూనిట్‌ను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్కలగండి గ్రామంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఆంజనేయస్వామి వారి విగ్రహాన్ని పరిశీలించారు. దమ్మపేటలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిగత డ్రైవర్ సోయం కృష్ణను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు కొయ్యల అచ్యుతరావు, కిషోర్, కొమరం శ్రీను, యార్లగడ్డ బాబు, పానుగంటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు

పినపాక/ మణుగూరు రూరల్/ అశ్వారావుపేటరూరల్/ అన్నపురెడ్డిపల్లి/ దుమ్ముగూడెం/ చంద్రుగొండ: ఈ నెల 15వ తేదీ నుంచి 17 వరకు మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు పినపాక, మణుగూరు, అన్నపురెడ్డిపల్లి, దుమ్ముగూడెం ఎంపీడీఓలు చంద్రశేఖర్, ఎం.చంద్రమౌళి, అన్నపూర్ణ, మూత్యాలరావు, చంద్రుగొండ ఎంఈఓ సత్తెనపల్లి సత్యనారాయణ, అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు, జట్లు ఈ నెల 14 లోపు తమ పేర్లను ఎంపీడీఓ కార్యాలయాల్లో, గ్రామపంచాయతీ సర్పంచ్ , కార్యదర్శుల వద్ద తమ జట్ల పేరు నమోదు చేయించుకోవాలన్నారు. 18 సంవత్సరాల నుండి 36 వయస్సు గల యువతీ, యువకులకు కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, గ్రామస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మండల స్థాయి విజేతలు జిల్లా స్థాయిలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. దుమ్ముగూడెంలో జరిగిన సమావేశంలో ఎస్సై కేశవరావు, ఎంఈఓ సున్నం సమ్మయ్య, ఆర్ఐ లక్ష్మయ్య, మండల పీడీలు, పీఈటీలు, అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తహసీల్దార్ లూథరన్ విల్సన్, ఎస్సై బీ.రాజేశ్ కుమార్, సీఆర్పీ ప్రభాకరాచార్యులు, సీసీఓ ఎస్‌కె.మహబూబ్, బీఆర్ఎస్ నాయకులు మండపాటి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేగా వ్యాఖ్యలు సరికాదు..

దమ్మపేట: భద్రాచలం నియోజకవర్గం, దుమ్ముగూడెంలో తునికాకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మండల పరిధిలోని నాచారం గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్ అధ్యక్షతన విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ పార్టీల ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమంలో తోటి గిరిజన ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై రేగా చేసిన అనుచిత వ్యాఖ్యలు ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాయకులు చీకటి శ్రీనివాసరావు, వెలివేటి శ్రీను, నాగేశ్వరరావు, గుత్తి శ్రీను, రావులపాటి బాబురావు పాల్గొన్నారు.

రేగాపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

పినపాక: ఎమ్మెల్యే రేగాపై కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యలు చేస్తే సహించం అని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం పార్టీ మండల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరుతుంటే ఎక్కడ ఓడిపోతామని భయంతో కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే జీర్ణించుకోలేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఓట్లు వేసి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ భద్రయ్య, సొసైటీ చైర్మన్ రవి వర్మ, వాసు బాబు, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, కొండేరు రాము, రాయల సత్యనారాయణ, బుల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఓటరు నమోదుపై వారం, వారం సమీక్ష నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లూథరన్ విల్సన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివిధ రాజకీయ పార్టీ బాధ్యులతో సమీక్షించారు. ఈ సమావేశంలో డీటీ సుచిత్ర, ఎన్నికల డీటీ లావణ్య, నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ప్రమాదానికి కారణమైన వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాజేశ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని బండి సుబ్రహ్మణ్యంనగర్‌లో కల్లూరి నాగేశ్వరరావు కూల్‌డ్రింక్స్ దుకాణం నడుపుతుండగా, గురువారం లోడ్‌తో వచ్చిన వ్యాన్ అదుపు తప్పి గోడను ఢీకొట్టింది. దీంతో గోడ కూలిపోగా భవనం యజమాని ప్రసాద్‌రావు ఫిర్యాదు మేరకు శుక్రవారం డ్రైవర్ శివసాయిపై కేసు నమోదు చేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



ట్రోఫీతో విజేత టీం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఆసుపాక గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఈ పోటీల్లో విజేతగా వినాయకపురం గ్రామ టీం, ద్వితీయ స్థానంలో అశ్వారావుపేట టీం నిలిచింది. ప్రథమ బహుమతిని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో, నాయకులు జారే ఆదినారాయణ రూ.30 వేల నగదు, ద్వితీయ బహుమతిగా జూపల్లి రమేష్ రూ. 20వేల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు ఎస్‌కె.కరీం, నాగు, ప్రసాద్, ఎస్‌కె.ఇమాం జానీ, రాజేష్, శేఖర్, రామారావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటాలకు పూలమాలలేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. నర్సులను సన్మానించి వారి సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలం అర్బన్: కేక్ కట్ చేస్తున్న వైద్యులు



మణుగూరు రూరల్: ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది



చంద్రుగొండలో..

బాధ్యతగా విధులు నిర్వర్తించండి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్వోటు జీఎం లలిత్‌కుమార్

మణుగూరు టౌన్: క్లరికల్ ఉద్యోగం బాధ్యతాయుతమైందని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్వోటు జీఎం లలిత్‌కుమార్ అన్నారు. నూతనంగా నియామకమైన అంతర్గత జూనియర్ అసిస్టెంట్లకు ఎంవీటీసీలో నిర్వహిస్తున్న నాలుగు రోజుల ఇండక్షన్ శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. జూనియర్ అసిస్టెంట్లు విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన జీతభత్యాలు, సంక్షేమ కార్యక్రమాలు, పదోన్నతులు, సెలవులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు టెర్మినల్ బెనిఫిట్స్ వంటివి పూర్తి చేయటానికి కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ఎంవీటీసీ మేనేజర్ నాగేశ్వరరావు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న ఎల్ఐసీ అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఎల్ఐసీ బీమాగ్రామ్ పథకంలో భాగంగా భద్రాచలం ఎల్ఐసీ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఎస్బీఎం గోపాలకృష్ణ చేతుల మీదుగా సర్పంచ్ గుండి వెంకటేశ్వర్లకు రూ.1లక్ష చెక్కును శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా ఎస్బీఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ... మిగతా పంచాయతీలూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలో వంద బీమా పాలసీలు అయితే బీమా గ్రామంగా గుర్తించి ప్రోత్సాహకం అందచేయడం జరుగుతుందన్నారు. అసిస్టెంట్ మేనేజర్ విశ్వేశ్వరుడు, డెవలప్‌మెంట్ అధికారి కృష్ణారావు, ఎంపీటీసీ ధర్మరాజు, ఉపసర్పంచ్ కొర్సా రామచంద్రయ్య, ముర్రం వీరభద్రం, కల్లూరి ప్రసాద్, ఇర్ప వీరాజు, రమణబాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి

దుమ్ముగూడెం: మండలంలోని చిన్న ఆర్లగూడెంలోని కొడెం వారి గుంపు కల్లూరు వారి గుంపులో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా నాయకులు సున్నం వీరభద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం గిరిజనులు ప్రగతిశీల కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ ట్యాంకులు పైపులైను పనిచేయట్లేదని తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. నరసింహారావు, సుమతి, సీత, సీతారమ్మ, సాయన్న పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఆసుపాక గ్రామంలోగల శ్రీ కృష్ణుడి ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారు.

ధర్నాను విజయవంతం చేయండి

చర్ల: గిరిజన సంక్షేమ శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల15న హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని దేవరాపల్లిలో సంఘం సీనియర్ నాయకులు కారం సీతయ్య అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే అటవీ జాతులకు, ఏజెన్సీ ప్రజల ఉపాధి, ఆర్థికంగా పుంజుకోవడం కోసం ఏర్పాటు చేసిన గిరిజన కో ఆపరేటీవ్ కార్పొరేషన్ అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిందన్నారు. వీటిపై పలుమార్లు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినప్పటికీ వాటిని అధికారులు పట్టించుకోకుండా ఆ ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారని ఆరోపించారు. పాయం నాగేశ్వరరావు, తెల్లం జనార్దనరావు, సోడి శ్రీను, కాక శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

కళాశాలలో టాయిలెట్లు ప్రారంభం



పరిశీలిస్తున్న జీఎం కేవీ థాలే

అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారజల కర్మాగారం యాజమాన్యం నిర్మించిన మరుగుదొడ్లను భారజల కర్మాగారం జీఎం కేవీ థాలే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ప్రిన్సిపల్ సత్యప్రకాష్ మాట్లాడుతూ.. కళాశాలలో నాలుగు గదులలో ఫ్లోరింగ్, డ్రింకింగ్ వాటర్, పైప్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీఎం కేవీ థాలే మాట్లాడుతూ.. కళాశాల సమగ్రాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ సుధాకర్, సివిల్ ఈఐసీ శశికుమార్‌శెట్టి, అధ్యాపకులు సంతోష్, టీఎస్‌యూసీ నాయకుడు కూరపాటి శ్రీను, ప్రవీణ్, కాంట్రాక్టర్ చందా సత్యనారాయణ పాల్గొన్నారు.

పంట నష్టం అంచనా



అరటితోటను పరిశీలిస్తున్న అధికారి సందీప్

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం తాకిడికి జరిగిన పంట నష్టాన్ని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి, అంచనా వేశారు. శుక్రవారం మండల పరిధిలోని దమ్మపేట, మందలపల్లి, ముష్టిబండ, అకినేపల్లి గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను, అధికారులు పరిశీలించారు. అరటి 60 ఎకరాలు, జీడిమామిడి 30, మామిడి 35, పామాయిల్ 4 విస్తీర్ణంలో పంట నష్టం జరిగిందని అంచనా వేశారు. పంట నష్టం నివేదికను జిల్లాస్థాయి అధికారులకు పంపుతామని తెలిపారు. ఈ పర్యటనలో మండల ఉద్యాన అధికారి సందీప్, ఏఈఓ దీప్తి, రైతులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే తునికాకు బోనస్ పంపిణీ

మణుగూరు రూరల్: సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన దశల వారీ ఆందోళనలు, పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తునికాకు కార్మికులకు బోనస్‌లు పంపిణీ చేసిందని పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తునికాకు బోనస్ చెల్లించాలని పార్టీ పలు దఫాలుగా అటవీశాఖ ఉన్నతాధికారులకు, మంత్రులకు వినతిపత్రాలు అందజేశామని, పోరాటాలు చేశామన్నారు. కొడిశాల రాములు, లెనిన్‌బాబు, ప్రసాద్, నరసింహారావు, నాగమణి, పద్మ, నాగలక్ష్మీ, సుధాకర్, ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వకండి..



మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

చంద్రుగొండ : మండుతున్న ఎండల నేపథ్యంలో తాగునీటి సదుపాయం కల్పనలో శాఖాధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బాణోత్ పార్వతి సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ పార్వతి మాట్లాడుతూ... దాహార్తి లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని కోరారు. సర్వసభ్య సమావేశానికి వివిధ ప్రధాన శాఖాధికారులు డుమ్మా కొట్టడంతో ఎంపీపీ పార్వతితోపాటు ఎంపీడీఓ రేవతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ, ఐబీ, విద్యుత్, ఆర్టీసీ, ఫారెస్టు శాఖాధికారులు గైర్హాజర్ కావడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఎంఈఓ సత్యనారాయణ, పశువైద్యాధికారి రాంప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి పర్యటన రద్దు

అశ్వాపురం: మండలంలో శనివారం పర్యటించాల్సిన రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్ పర్యటన రద్దయినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గొందిగూడెంలో ఇసుకవాగుపై, తుమ్మల చెరువులో లోతువాగుపై వంతెనల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేయాల్సి ఉందని, త్వరలోనే మంత్రి పర్యటన తేదీ ఖరారవుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని 33/11 సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎంఎల్ నర్సింహారావు శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో చంద్రుగొండ, తిప్పనపల్లి, దామరచర్ల, అయన్నపాలెం, సత్యనారాయణపురం, రావికంపాడు, బాలికుంట, బెండాలపాడు, గుర్రాయిగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'పదండి పల్లెకు పోదాం' కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఐఎంఏ తెలిపింది.

వితరణ

మణుగూరు రూరల్ : మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామంలో పలువురి ఇంటి పైకప్పులు గాలివానకు పూర్తిగా దెబ్బతినగా సర్పంచ్ కాయం తిరుపతమ్మ శుక్రవారం బాధితుల కుటుంబాలకు ఇంటి నిర్మాణాలకు అవసరమైన సిమెంట్ రేకులను వితరణగా అందజేశారు. వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

జేపీఎస్‌లతో చర్చలు జరపాలి

చర్ల: గ్రామపంచాయతీ కార్యదర్శులతో చర్చలు జరపాల్సిన ప్రభుత్వం జర్చలు జరుపకుండా వారిని విధుల్లో నుంచి తొలగిస్తామంటూ బెదిరించడం సరికాదని, తక్షణమే వారితో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కారదర్శి కొండా చరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చర్లలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలెం చుక్కయ్య, మునిగెల శివ, చల్లా బాలు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల అభినందన

దమ్మపేట: మండల పరిధిలోనిగండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది, విద్యార్థులను మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం అభినందించారు. పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా గండుగులపల్లి పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తుమ్మలను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, హెచ్‌ఎం కీసర లక్ష్మి, ఉపాధ్యాయులు రాయల హనుమంతరావు, సత్యనారాయణరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ భాగం జ్యోతి, ఎర్రా వసంతరావు, కాసాని నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి

భద్రాచలంఅర్బన్: ఐకేపీ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని సీఐటీయూ శ్రామిక మహిళ పట్టణ కన్వీనర్ మర్లపాటి రేణుక కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె సమ్మెను ప్రారంభించి మాట్లాడారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్న వీఓఏలపై రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుందని, సమ్మె విచ్ఛిన్నానికి చేసే కుట్రలను తిప్పి కొడతామన్నారు. దీక్షలను మెకానిక్ యూనియన్ నాయకులు సతీష్, రాము ప్రారంభించారు. వనిత, వందన, వీఓఏల నుండి ఎస్హెచ్ సభ్యులు పూర్తి సంఘీభావం తెలియజేశారు. సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యులు ఎస్. నాగరాజు, వీఓఏల సంఘం కార్యదర్శి చంద్రలీల, కోశాధికారి సీతారత్నం పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలి

మణుగూరు టౌన్: సీపీఐ పార్టీని గ్రామస్థాయి నుంచే పటిష్టం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీపీఐ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.లక్ష్మీనారాయణ, బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్, నాయకులు మోహన్‌రావు, సుధాకర్, రమేష్, నరసింహారావు, వీరస్వామి, పాల్గొన్నారు.